# బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్

వరల్డ్ చర్చ్ హెడ్‌క్వార్టర్స్, సెయింట్ థామస్ కమ్యూనిటీ
తిరువల్ల-689 103, కేరళ, ఇండియా

## కాపరి పత్రిక

నా ప్రియమైన కాపరులకు మరియు పరిశుద్ధ సభలోని విశ్వాసులందరికీ,

మన ప్రభువు మరియు రక్షకుడైన యేసు క్రీస్తు ద్వారా మీకు కృప, కనికరము, సమాధానము కలుగును గాక!

పరిశుద్ధ సంఘ జీవితంలో మరొక ఆరాధనా సంవత్సర అంతానికి (Liturgical Year) మనం చేరువవుతున్న వేళ, నిలిచి ధ్యానించడానికి మనకొక పరిశుద్ధమైన అవకాశం లభించింది. మన ఉమ్మడి జీవితంలోని ఒక ముఖ్యమైన అంశానికి మన సమర్పణను నూతనపరచుకోవడానికి నేను మన సభలోని ప్రతి పారిష్‌ను (సంఘాన్ని ) మరియు విశ్వాసులందరినీ ఆహ్వానిస్తున్నాను: అదేమనగా, ప్రతి పరిష్‌ను ఒక సురక్షితమైన మరియు పరిశుద్ధమైన ఆశ్రయ స్థలముగా మార్చడం.

### చర్చ్ వైద్యశాలగా మార్చబడాలి

పరిశుద్ధ పితరులు తరచూ సంఘమును ఒక ఆసుపత్రిగా వర్ణించారు, ఇక్కడ గాయపడిన మరియు నలిగిన ఆత్మలు మహానీయ వైద్యుడైన ప్రభువు నుండి కనికరాన్ని, స్వస్థత అనుగ్రహింపబడుతుంది. మన ప్రభువైన యేసు క్రీస్తు గురించి చెప్పుచున్నప్పుడు ఈ చిత్రం మిక్కిలి అందంగా వ్యక్తపరచబడింది: "విజయమొందుటకు న్యాయవిధిని ప్రబలము చేయువరకు ఈయన నలిగిన రెల్లును విరువడు మకమకలాడుచున్న అవిసెనారను ఆర్పడు ." (మత్తయి 12:20).

నలిగిన రెల్లును విరువడు మకమకలాడుచున్న అవిసెనారను ఆర్పడు అనేవి ఎవరి శక్తి క్షీణిస్తుందో, ఎవరి నిరీక్షణ ఆరిపోతుందో, మరియు ఎవరి జీవితాలు పాపం, శ్రమలు లేదా పరిస్థితుల వలన గాయపడ్డాయో వారిని క్రీస్తు ఎంత మాత్రమే త్రోసివేయడు అని సూచించుచున్నది. అట్టివారిని ఆయన బహు మృదువుగా బాగుపరుస్తాడు, బలపరుస్తాడు మరియు నూతనపరుస్తాడు. వారు ఆయన ఆలయమునకు  వచ్చునప్పుడు, పశ్చాత్తాపము మరియు ప్రార్థన ద్వారా స్వస్థత పొందుతారు; దేవుని జీవముగల వాక్యము చేత పవిత్రపరచబడి, పరిశుద్ధ సంస్కారములలో పాలుపొందుతూ, క్రీస్తు శరీరంలో కలిసి జీవించడాన్ని అనుభవిస్తారు.

### చర్చ్ సురక్షితమైన స్థలముగా మార్చబడాలి

పరిశుద్ధ సంఘములో కూడుకొనియున్న మనలో ఏ ఒక్కరం కూడా ఇప్పటికే సంపూర్ణులమయ్యామని సభకు రాలేదు. బదులుగా, మన ప్రభువే స్వయంగా ఇలా ప్రకటించారు: "రోగులకేగాని ఆరోగ్యము గలవారికి వైద్యు డక్కరలేదు." (మత్తయి 9:12 ).

ఈ కారణము చేత, ప్రతి చిన్నారి, ప్రతి యౌవనస్థుడు, ప్రతి బలహీనమైన వ్యక్తి మరియు మన సంఘ సమాజాలలోని ప్రతి సభ్యుడు గౌరవంతో చూడబడాలని, మరియు ఏ విధమైన హాని కలగకుండా కాపాడబడాలని మన చర్చి యొక్క కట్టుబాటైయున్నది. సురక్షితమైన సభ అనునది కేవలం విధానాలు, నిబంధనలు ఉన్నది మాత్రమే కాదు కానీ మా క్రీస్తవ్య ప్రేమ, గౌరవము, యథార్థత, జవాబుదారీతనం మరియు ఒకరిపట్ల ఒకరు నిజమైన సంరక్షణ అందరిచేత ఆచరించబడే ఒక సమాజముగా ఉండాలి.

మన పారిష్‌లలోనికి ప్రవేశించే వారందరూ ఆయన ప్రజల ద్వారా - అనగా క్రీస్తు శరీరమైన మీ ద్వారా మరియు నా ద్వారా క్రీస్తు యొక్క యొక్క దయా కనికరములతో పెనివేయబడిన అనుభవాన్ని అనుభవించాలి.

## చర్చ్ సువార్త బాధ్యతను కలిగి ఉండాలి

కాబట్టి భద్రతను అందించడం అనేది కేవలం ఒక సంస్థ యొక్క బాధ్యత లేదా కార్య నిర్వహణ సమూహం యొక్క నిబంధన మాత్రమే కాదు. అది బలహీనుల పట్ల దీర్ఘశాంతము, పాపుల పట్ల కనికరము మరియు తనలో ఆశ్రయము కోరే వారందరి పట్ల జాలి కలిగిన దేవుని స్వభావంలో నుండి వచ్చిన సువార్త యొక్క బాధ్యతయై యున్నది.

ఈ సమర్పణ మనల్ని పారిష్ జీవితంలో క్రీస్తు-కేంద్రీకృత ప్రవర్తనా నియమావళికి తిరిగా అంకితం కావాలని కోరుతోంది. ఇట్టి దానిలో ప్రతి బిషప్, యాజకుడు, డీకన్, సువార్తికుడు, పరిచర్య నాయకుడు, స్వచ్ఛంద సేవకుడు మరియు నమ్మకమైన సభ్యుడు కూడా తమ మాటల్లో, క్రియల్లో మరియు సహవాసములో క్రీస్తు స్వభావాన్ని కనపరచే బాధ్యతను పంచుకుంటున్నారు.

మనం బాధ్యతలతో కూడిన అధికారాన్ని నిర్వహించే విధానం, ఒకరినొకరు సంరక్షించుకునే విధానం మరియు మన ప్రవర్తన ప్రతిదీ ఎల్లప్పుడూ మనం సేవించే ప్రభువునకు ఘనత తెచ్చేదిగా ఉండాలి.

## చర్చ్ పశ్చాత్తాపం మరియు పునరంకితానికి పిలుపు కలిగి ఉండాలి

నూతనత్వము అనేది పశ్చాత్తాపంతో ప్రారంభమవుతుందని పరిశుద్ధ గ్రంథము మనకు గుర్తుచేస్తోంది. కీర్తనకారుడు ఇలా ప్రార్థిస్తున్నాడు: "దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతన ముగా పుట్టించుము. " (కీర్తనలు 51:10). ఆరాధన, ప్రార్థన, ఉపవాసము మరియు నమ్మకమైన నడకతో కూడిన నూతన చర్చి కాలామానం సంవత్సరంలోనికి ప్రవేశించే ముందు, మనలో ప్రతి ఒక్కరం మనల్ని మనం ప్రశ్నించుకోవడానికి సమయం కేటాయిద్దాం: మన పారిష్‌లు నిజంగా దేవుని నిత్య విలువలకు మరియు జీవనశైలికి సజీవ ప్రతిరూపాలుగా ఉన్నాయా?

మనలను, మన పారిష్ సమాజాలను పరిశుద్ధ జీవితానికి, పరిచర్యలో నమ్మకత్వానికి మరియు మన సంరక్షణకు అప్పగించబడిన వారి భద్రతకు పునరంకితం చేసుకుందాం. ఇది మనల్ని కొత్త విషయాల వైపు కాదు, మన ప్రాథమిక మరియు పునాది వేళ్ల వైపు తిరిగి వెళ్లమని పిలుస్తోంది. మనకు అప్పగించబడిన అన్ని వనరులను అనగా - నూతన సంవత్సర లేఖన పఠనముల గ్రంథమును (Lectionary), సభ యొక్క ఆరాధనా క్యాలెండర్, పండుగలు, ఉపవాసాలు, మహోత్సవాలు, ధర్మకార్యాలు మరియు ఎంచుకున్న సాధారణ జీవిత శైలిని సంపూర్ణంగా ఉపయోగించుకుందాం. తద్వారా వ్యక్తులుగా, పారిష్ సమాజాలుగా క్రీస్తు నందు వివేచన, గ్రహింపు, కనికరము పెంచుకుంటూ, తీర్పు తీర్చడానికి బదులు అవసరమైన ప్రతిచోట దయను, క్షమాపణను చూపడానికి సిద్ధపడదాం.

నా ప్రియమైన దేవుని పిల్లలారా, మనం నూతన చర్చి కాలమాన ఆరాధనా సంవత్సరానికి సిద్ధపడుతుండగా, మీలో ప్రతి ఒక్కరినీ నా ప్రార్థనలలో జ్ఞాపకం చేసుకుంటున్నాను. దేవుని సింహాసనం ఎదుట మీ ప్రార్థనలలో బలహీనుడు, పాపియైన ఈ సేవకుడిని కూడా దయచేసి జ్ఞాపకం చేసుకోనగలరు. పరిశుద్ధ త్రిత్వము అనగా తండ్రి, కుమారా, పరిశుద్ధాత్మ మనకు పవిత్రమైన హృదయాలను, సేవ చేయడానికి సిద్ధంగా ఉన్న చేతులను, క్రీస్తు ప్రేమను నమ్మకంగా ప్రతిబింబించే జీవితాలను ప్రసాదించును గాక. పరిశుద్ధ దైవమాత (థియోటోకోస్) మరియు సకల పరిశుద్ధుల విజ్ఞాపనలు ఇప్పుడు మరియు ఎల్లప్పుడూ మనకు కాపుదలగా ఉండును గాక. ఆమేన్!

తండ్రి వంటి ప్రేమతో మరియు ప్రార్థనలతో,
క్రీస్తు నందు మీ ఆత్మీయ తండ్రి,

✠ మోరాన్ మోర్ శామ్యూల్ థియోఫిలస్ మెట్రోపాలిటన్

తేదీ: 10 సెప్టెంబర్ 2026
స్థలం: వరల్డ్ చర్చ్ హెడ్‌క్వార్టర్స్

---

**P.S:** P.S: విశ్వాసుల ప్రోత్సాహార్థం దీనిని ప్రతి పారిష్‌లలో చదివి వినిపించేలా చూడగలరు.